క్లుప్తంగా

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు



మానవపాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని అమరవాయి, మానవపాడు గ్రామాల ప్రజలకు, గర్భిణులకు సోమవారం డాక్టర్ రిజ్వానా తాన్విర్ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆయా గ్రామాల నుంచి 31 మంది గర్భిణులు రాగా, వారికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. న్యూట్రీషన్ గురించి రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు ఐరన్ మాత్రలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో సాధారణ కాన్పులు జరగాలని సూచించారు. కార్యక్రమంలో హెలెన్, చంద్రన్న, సంధ్యారాణి, తిరుమాల్‌రావు, సోని, జయమ్మ, మాబి, దేవమ్మ పాల్గొన్నారు.

ధరూరులో భారీవర్షం



ధరూరు: మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వాన పడింది. సాయంత్రం 6 గంటల నుంచి 7గంటల వరకు గంట పాటు కుండపోతగా వాన కురిసింది. ఖరీఫ్ పంట సాగులో అనుకూలంగా మారిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విత్తనాలు వేసుకున్న రైతులకు ఈ వాన అనుకూలంగా మారింది. నారు మడులు సిద్ధం చేసుకున్న రైతులు వరినాట్లు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరు జల్లులు కురిశాయి.

పంట నమోదు పరిశీలన



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, గోకులపాడు గ్రామాలలో సోమవారం మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో రైతులు ఏఏ పంటలను సాగు చేశారో నమోదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మణిప్రకాశ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం అఖండ భజన




అయిజ: వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని మండలంలోని సంకాపురంలో సోమవారం భజన మండలి సభ్యులు అఖండ భజన కార్యక్రమం ప్రారంభించారు. దానికి ముందు గ్రామ ప్రజలు నదీ జలాలతో గ్రామ దేవతలకు జలాభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు అర్చన, ఆకుపూజలు చేశారు. ఐదు రోజులు అఖండభజన నిర్వహిస్తున్నట్లు సంకాపురం భజన మండల సభ్యులు తెలిపారు.

యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రంగస్వామి



గద్వాల అర్బన్: భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వామన్ పల్లి రంగస్వామి ఎన్నికై నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సంఘం జాతీయ కో కన్వీనర్ వంగూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయనను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించినట్లు పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు.

ప్రయాణం ప్రమాదకరం



అలంపూర్ రూరల్: మండల పరిధిలోని గ్రామాలలో చిన్నారులు అలంపూర్ ప్రైవేట్ పాఠశాలలకు చదువుకునేందుకు ప్రతిరోజూ ఆటోలో పరిమితికి మించి ప్రయాణిస్తున్నారు. ఆటో నిండినా వేలాడుతూ పాఠశాలలకు వెళ్తున్నారు. పట్టు తప్పితే చాలా ప్రమాదం సంభవిస్తుంది. ర్యా లంపాడ్, సుల్తాన్‌పూర్, శింగవరం, కాశీపురం గ్రామాల విద్యార్థులు అలంపూర్ చౌరస్తాలో ప్రైవేట్ పాఠశాలలకు వస్తున్నారు. గతంలో ప్రమాదాలు సంభవించాయి. అయి నా తల్లిదండ్రుల్లో, డ్రైవర్లలో మార్పు రాకపోవడం శోచనీయం.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

- మొక్కలు నాటిన అధికారులు, విద్యార్థులు
- వన మహోత్సవంలో మొక్కలు నాటాలని పిలుపు



గట్టులో మహిళా సమాఖ్య భవనం దగ్గర మొక్కలను నాటుతున్న అధికారులు

గట్టు: మొక్కలను నాటడడమే కాకుండా, వాట సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ స్వీకరించాలని ఎంపీడీఓ చెన్నయ్య కోరారు. వన సంరక్షణలో భాగంగా సోమవారం మండల సమాఖ్య భవనం దగ్గర మహిళా సంఘాల సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మొక్కలను ప్రభుత్వం సరఫరా చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. 27 పంచాయతీలకు సంబంధించి 27 నర్సరీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొక్కలను నాటేందుకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ కోరారు. కస్తూర్బా పాఠశాల దగ్గర ప్రత్యేక అధికారిణి గోపిలత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేష్, ఏపీఎం సాంబశివుడు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

అయిజ: విరివిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించి పర్యావరణాన్ని కాపాడుదామని ఎంపీడీఓ వెంకటయ్య అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మండలంలోని వెంకటాపురం, గుడుదొడ్డి గ్రామాల్లో అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ప్రతి గ్రామంలో అన్ని ప్రదేశాల్లో వీలైనన్ని మొక్కలు నాటి, వాటిని పెంచి పెద్ద చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ లాలు నాయక్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ అధికారులకు సూచించారు. ఇటిక్యాల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో అధికారులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. తప్పనిసరిగా ప్రతి జీపీలో 2500 మొక్కలు నాటేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ శివజ్యోతి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పల్లెలు పచ్చదనంతో ఉట్టిపడాలి

మల్దకల్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వివిధ ప్రదేశాలలో మొక్కలు నాటారు. పల్లె ప్రకృతి వనాలలో మొక్కలను పెంచుతూ గ్రామాల్లో పచ్చదనం వెల్లివిరిసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం, ఏపీఓ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వెంకటాపురంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ వెంకటయ్య



ఇటిక్యాలలో..



మల్దకల్‌లో..

కనులపండువగా మొహర్రం ఉత్సవాలు



అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణం, మండలంలో పీర్ల పండుగ కనుల పండువగా నిర్వహిస్తున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. 7వ రోజు ఆదివారం రాత్రి అన్నదమ్ములైన శింగవరం ఇమాం ఖాసీం, పెద్దిమాం ఖాసీం పీర్లు రాత్రి సవారికి లేచి ఉదయం 9 గంటలకు సవారి ముగించాయి. పట్టణంలో పుర వీధుల గుండా తిరిగాయి. పోలీస్‌స్టేషన్ సమీపంలో పీర్ల కలయిక పలువురిని ఆకట్టుకుంది. మంగళవా రం అలెక్బర్‌పీరు సవారి లేచేందుకు నిర్వహకులు సిద్ధం చేశారు. సోమవారం రాత్రి అలెక్బర్ సవారికి లేచి పురవీధుల గుండా సవా రి చేస్తారు. మంగళవారం రాత్రి పెద్దలాలీసాబ్, భైరంపల్లి లాలీసాబ్, హస్తం, గంధం పీర్లు సవారికి లేచేందుకు నిర్వహకులు సిద్ధం చేస్తున్నారు.

చిన్నారుల సంఖ్య పెంపే లక్ష్యం

- గ్రామాల్లో అమ్మమాట-అంగన్‌వాడీ బాట ర్యాలీలు
- రెండున్నరేళ్ల నుంచి పిల్లలను అంగన్‌వాడీకి పంపాలి: సీడీపీఓ సుజాత



గట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు

మానవపాడు: తెలంగాణ రాష్ట్రంలోనే సోమవారం నుంచి 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమం ప్రారంభిచామని ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీ ప్రైమరీ పాఠశాల్లో చేర్పించాలని తెలిపారు. చిన్నారులను గురించి ప్రీప్రైమరీ పాఠశాల్లో చేర్పించేందుకు 15 నుంచి 20 వరకు అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చివరి రోజు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆస్మా, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

గట్టు: అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం, బల్గెర గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులతో ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. రెండున్నరేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సున్న బాలబాలికలను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్లు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆట పాటల ద్వారా విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు యూనిఫాంలతో పాటు వారి సమగ్రఅభివృద్ధి కోసం అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గట్టు అంగన్‌వాడీ టీచర్లు ఉమామహేశ్వరి, సుజాతమ్మ, రాజేశ్వరి, బల్గెర అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, శోభారాణి, అలివేలమ్మ, కవిత,కార్యదర్శి సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చర్లగార్లపాడులో విద్యార్థులతో ర్యాలీ



శాంతినగర్ సెంటర్‌లో అమ్మమాట-అంగన్‌వాడీ బాటలో పాల్గొన్న టీచర్లు, చిన్నారులు

పౌష్టికాహారం పంపిణీ చేయాలి

మల్దకల్: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సీడీపీఓ కమలాదేవి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. అమ్మమాట-అంగన్‌వాడీబాట కార్యక్రమాన్ని మల్దకల్, చర్లగార్లపాడు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ కమలాదేవి, ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏపీఎం నరహరి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారంను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, టీచర్లు సురేఖ, మహేశ్వరమ్మ, లక్ష్మీరంగమ్మ, పుష్పమ్మ ఉన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2, 5, పైపాడు అంగన్‌వాడీ సెంటర్లలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఫ్లకార్డులు పట్టుకుని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పైపాడులో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వడ్డేపల్లి సెక్టర్‌లోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు జయలక్ష్మి, లక్ష్మీదేవమ్మ, నాగమణి, ఏఎన్ఎం లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు శివుడు, అయా సెంటర్లకు చెందిన ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే విజయుడు



వడ్డేపల్లి మండలం తనగలలో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

శాంతినగర్: పేద కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లోని పేదలకు సీఎం సహాయ నిధి చెక్కులను సోమవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మండలంలోని తనగల, జూలెకల్, జిల్లెడుదిన్నె, బుడమొర్సు గ్రామాల్లోని బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే చెక్కులు అందజేశారు. తనగల రవికుమార్ ఆచారికి రూ.2 లక్షల చెక్కు,, మహేశ్వరికి రూ.23 వేలు, జూలెకల్ రవీందర్‌స్వామికి రూ.60 వేల చెక్కు, పెద్దరాముడుకు రూ.44 వేల చెక్కు, బుడమొర్సు కుర్వ అనంతమ్మకు రూ.18 వేలు, అదేగ్రామానికి చెందిన కుర్వ పార్వతమ్మకు రూ.16 వేలు, గాంధీనగర్‌కు చెందిన ముక్తాశ్వరప్రసాద్‌కు రూ.లక్ష, శాంతినగర్‌కు చెందిన సోమయ్య ఆచారికి రూ.44 వేలు, జిల్లెడుదిన్నెకు చెందిన శేషమ్మకు రూ.లక్ష, కొంకల రేపల్లె జ్యోతికి రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొంది ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులతో ఆర్థిక ఉపశమనం లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే వెంట పుల్లూరు నాగేశ్వర్‌రెడ్డి, రాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, రాధకృష్ణారెడ్డి, శేషిరెడ్డి, గజేందర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, భార్గవ్, గద్దం శ్రీను, అశ్వత్థామరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రవిరెడ్డి, లక్ష్మీపతి పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలి



విద్యార్థిని ముస్కాన్‌బేగంకు బహుమతిని అందజేస్తున్న ఆర్ఎల్‌సీ ఖాజాబహుద్దీన్

గద్వాల అర్బన్: ప్రతి విద్యార్థి పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించేలా చదవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ప్రసాద్‌రావు, మైనార్టీ గురుకుల ఆర్ఎల్‌సీ ఖాజాబహుద్దీన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థినులకు వెల్‌కం పార్టీ నిర్వహించారు. క్రమశిక్షణ, విద్యతోనే ఉత్తమ భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యార్థినులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివితే ఉన్నతంగా స్థిరపడుతారన్నారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరికి అలరించాయి. బైపీసీ మొదటి సంవత్సరంలో 440 మార్కులకు గాను 437మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం రాణించిన విద్యార్థిని ముస్కాన్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఎంపీసీ, బైపీసీలో మొదటి, రెండో స్థానాల్లో రాణించిన మదీహ, శ్రావణి, ఉషా, ఫరీహీన్ బేగం , నిషాపర్వీన్, చాంద్‌బీలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గురుకులల కో ఆర్డినేటర్ సలీమ్, మాజీ ప్రిన్సిపల్ జలీల్, ఇంకా స్వార్డ్ ఏజెన్సీ నిర్వాహకుడు అతిఖుర్ రహ్మాన్, కళాశాల ప్రిన్సిపల్ నవీత, లెక్చరర్లు, తదితరులు ఉన్నారు.

డ్రెయినేజీ నిర్మించి ఇబ్బందులు తొలగిస్తాం

- మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్



కాలనీవాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

గద్వాల రూరల్: వర్షాలకు పట్టణంలో చాలా చోట్ల డ్రెయినేజీలు పొంగిపొర్లుతుండడంతో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని, ఈ ప్రాంతాలలో వెంటనే డ్రెయినేజీల నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగిస్తామని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని 24వ వార్డును పరిశీలించారు. వార్డులోని అహ్మద్‌నగర్ కాలనీలో వర్షపు నీరు నిలిచిపోవడంతో కాలనీవాసులు మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన కాలనీలో పర్యటించారు. నూతన డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి ఇబ్బందులు తొలగిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కోటేష్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని నిరసన



పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

అయిజ: మండలంలోని కిష్టాపురంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు పాఠశాల ముందు నిరసన తెలిపారు. టీచర్ల బదిలీల ప్రక్రియంలో భాగంగా కిష్టాపురం పాఠశాలలో పని చేసే టీచర్ బదిలీపై కొంకల పాఠశాలకు వెళ్లారని, కిష్టాపురానికి అలాట్‌మెంట్ అయిన టీచర్ ఇప్పటి వరకు రాలేదని వాపోయారు. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడు మాత్రమే విధులకు హాజరవుతున్నారని, మరో టీచర్ రావాల్సి ఉందని తెలిపారు. సమస్యలను పరిష్కరించకుంటే వెంకటాపురం స్టేజీ సర్కిల్ రోడ్డుపై ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనారు.

సమస్యలపై సీఎంకు పోస్టుకార్డులు



పోస్ట్ కార్డుల ప్రదర్శన చేస్తున్న బీజేపీ నాయకులు, విద్యార్థులు

అయిజ: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వివిధ కళాశాలల విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్ కార్డులు రాసి పోస్ట్‌డబ్బాల్లో వేశారు. సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో పాటు హరిహర జూనియర్ కళాశాల విద్యార్థులు పోస్ట్ కార్డులు రాసి పోస్ట్ డబ్బాలలో వేశారు. మండల కేంద్రంలో వసతి గృహాలు ఏర్పాటు చేయాలని, డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు ఏర్పా టు చేయించాలని పోస్ట్ కార్డుల్లో రాశారు. విద్యార్థుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు భగత్‌రెడ్డి, ప్రదీప్ కుమార్, జిల్లా ఓబీసీ ప్రధాన కార్మదర్శి వెంకటేష్, కిసాన్ మోర్చ అధ్యక్షుడు వీరేశ్ గౌడ్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి



ధరూరు: గ్రామాల్లోని మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ మంజుల అన్నారు. మండలానికి ఇందిరా మహిళా శక్తి కింద మంజూరైన లోన్స్ ఎంపిక విధానంపై సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సంగీత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐకేపీ సిబ్బందితో పాటు మండల సమాఖ్య సభ్యులు గ్రామాల వారీగా అర్హత కలిగిన సంఘాలకు ఈ రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీలు నవీన్, జయరాజ్, వీఓలు తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి పెంచుకోవాలి



ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా రుణాలు తీసుకొని మహిళలు జీవనోపాధి పెంచుకోవాలని ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ అన్నారు. ఇటిక్యాల మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ షఫీ ఉల్లాతో కలిసి ఆయన మీ సేవ కేంద్రాలు, గేదెల పెంపకం, ఎంటర్ ప్రైజెస్, పెరటి కోళ్ల పెంపకం వంటి వాటిపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా సంఘంలో బాగా చదువుకున్నవారు ఎవరైనా ఉంటే వారికి మీ సేవ కేంద్రాన్ని మంజూరు చేస్తామన్నారు. ఇప్పటికే చాగాపురం, వల్లూరు గ్రామాలకు మంజూరు చేశామన్నారు. ఏపీఎం కురుమన్న, ఏపీఓ శివజ్యోతి, సీసీలు ఈదన్న, నారాయణ, బీచుపల్లి, కురుమన్న ఉన్నారు.

చేనేత సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌ను సన్మానిస్తున్న చేనేత కార్మికులు

రాజోళి: చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మండలంలోని చేనేత కార్మికులు సోమవారం కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలో వెయ్యి మందికి పైగా చేనేత కుటుంబాలకు జీవనోపాధికి దూరమయ్యే పరిస్థితి కనిపిస్తుందని కలెక్టర్‌కు తెలిపారు. కార్మికులకు ఆసరాగా చేనేత మిత్ర, త్రిఫ్ట్ ఫండ్ లాంటి పథకాలు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో కార్మికులు దిక్కుతోచని స్థితిలో పడ్డారని, వారి మగ్గాలకు కూడా పనులు లేకుండా పోతున్నాయని తెలిపారు. చేనేత కార్మికులు కేవలం మగ్గంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, అలాంటి వారికి పథకాలు అందకపోవడం వల్ల, అప్పులు చేసుకుని జీవించాల్సి వస్తుందన్నారు. స్పందించిన కలెక్టర్ చేనేత జౌళి శాఖ ఏడీ గోవిందయ్యను పిలిచి, కార్మికులకు సంబంధించిన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, కార్మికుల విజ్ఞప్తుల పట్ల సానుకూలంగా స్పందించారు. అనంతరం కలెక్టర్‌ను చేనేత శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నిషాక్, షబ్బీర్, ఖాజా హుస్సేన్, వీరేష్, చేనేత శ్రామిక సేవా సమితి సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న యువకులు

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక యువకులు కోరారు. సోమవారం వారు విద్యార్థులతో కలిసి పాఠశాలలో సమస్యలను పరిశీలించారు. విద్యార్థులు కూర్చోవడానికి బండలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. 450 మంది పైగా విద్యార్థులున్న పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, డిజిటల్ క్లాసులు నిర్వహించేందుకు నేటి వరకు మోక్షం కలగడం లేదని, వాచ్‌మెన్ లేకపోవడంతో పరిసరాలల్లో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతుందన్నారు. సమస్యలను పాఠశాలకు నూతన గెజిటెడ్ హెడ్‌మాస్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హరుణ్ రషీద్‌కు విన్నవించారు. స్థానిక స్థితిగతులను తెలుసుకుని సమస్యల పరిష్కారానికి సహకరించాలని యువకులు కోరారు. ఈ సందర్భంగా ఆయనను పూల మాల, శాలువాతో సన్మానించారు.

సచివాలయ ముట్టడిపై ముందస్తు అరెస్టు



అయిజ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

గట్టు: బీఆర్ఎస్, పీడీఎస్‌యూ నాయకులను సోమవారం తెల్లవారు జామున గట్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రూపు-2 పోస్టులను పెంచాలని, డీఎస్సీకి 3నెలల గడువు ఇవ్వాలంటూ నిరుద్యోగులకు మద్దతుగా చలో సచివాలయం ముట్టడికి పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడిజిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి అంగడి బస్వరాజు, బీఆర్ఎస్ నేత వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హాలీంపాషను గట్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అయిజ: సచివాలయం ముట్టడి సందర్భంగా వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను, నిరుద్యోగులను సోమవారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. పల్లయ్య, దర్వేష్, విజయ్ బీచుపల్లి, సుబాన్, బ్రహ్మం, రాముడు, మోహన్ రెడ్డి, జమ్మన్నగౌడ్, ప్రవీణ్‌లు ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: నిరుద్యోగులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందస్తుగా మండలంలోని వివిధ పార్టీల నాయకులను ఆదివారం అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేసి ఇటిక్యాల, కోదండాపురం పీఎస్‌లకు తరలించారు.